నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, ఆదివారం 24 మార్చి 2024 | HYDERABAD




## మండే ఎండకు.. దుపట్టా గొడుగు

సిటీలో మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ పనుల కోసం బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శనివారం నగరంలో గరిష్ఠం 37.5, కనిష్ఠం 23.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చిత్రంలో కేబీఆర్ పార్కు వద్ద ఎండ తీవ్రతకు గురికాకుండా చున్నీ కప్పుకొని వెళ్తున్న యువతులు.



## చిన్నోడికి ఎంత కష్టం

చిట్టి చేతులు..చక్కని రాతకు..చదువుకు దూరమవుతున్నాయి. ఎంతో భవిత ఉన్నా..కాలే కడుపు కోసం..హానికారకమైన రంగు వేసుకొని..సైబర్ టవర్స్ వద్ద గాంధీ వేషధారణలో ఓ చిన్నారి ఇలా భిక్షాటన చేస్తూ..కనిపించాడు. చూసిన వారు చిన్నాడోకి ఎంత కష్టముందో అనుకుంటూ..తోచిన డబ్బులు చేతికందించారు.

# లోక్‌సభ బరిలో పజ్జన్న

### సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా తీగుళ్ల పద్మారావు గౌడ్
### ప్రస్తుతం సికింద్రాబాద్ ఎమ్మెల్యే
### కేసీఆర్ ఆశీస్సులతో ఆయనకు సికింద్రాబాద్ సీటు

సిటీబ్యూరో/సికింద్రాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): పజ్జన్న. ఇది పేరు మాత్రమే కాదు నిరుపేద గుండెల్లో ఓ ధైర్యం. ఏ ఆపదొచ్చినా నేనున్నానంటూ భరోసానిచ్చే ఓ నమ్మకం. అందుకే పజ్జన్న అంటే గ్రేటర్ ప్రజలు తమ గుండెల్లో పెట్టుకుంటారు. ఇంట్లో మనిషిలా ఆరాధిస్తారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు సైతం పజ్జన్నతో అభిమానంగా నడుచుకుంటారు. ఉద్యమ రథ సారథి కేసీఆర్ అడుగు జాడల్లో నడిచిన పజ్జన్న.. ప్రతి ఎన్నికల్లో విజయ దుందుభీ మోగిస్తూ రికార్డు సృష్టిస్తున్నారు. సాధారణ కార్యకర్తగా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. మంత్రి, డిప్యూటీ స్పీకర్ పదవులను నిర్వర్తించి రాష్ట్ర నాయకుడిగా ఎదిగారు ప్రస్తుత సికింద్రాబాద్ ఎమ్మెల్యే తిగుళ్ల పద్మారావు గౌడ్. ఇప్పటికీ ఈ నియోజకవర్గం నుంచి మూడు సార్లు గెలిచి తన సత్తా చాటారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. కేసీఆర్ ఆశీస్సులతో ఎంపీగా గెలిచి తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.



### సామాజిక నేపథ్యం

పద్మారావు గౌడ కులానికి చెందిన వారు. సికింద్రాబాద్‌లో మోండా మార్కెట్‌లోని టకార బస్తీవాసి. తల్లిదండ్రులు ఈశ్వరయ్య, రాములమ్మ. బస్తీవాసులతో ఆయనకు చాలా బలమైన సంబంధాలు ఉన్నాయి. వారంతా పద్మారావు అభిమానులుగా ఉన్నారు. పేద కుటుంబంలో జన్మించిన పద్మారావు అంచెలంచెలుగా రాజకీయాల్లో రాణించారు.

### ఇదీ రాజకీయ ప్రస్థానం..

2001లో ఉద్యమ రథసారథి కేసీఆర్ పిలుపు మేరకు పద్మారావుగౌడ్ బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 2002 నుంచి 2004 వరకు జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా చేశారు. అనంతరం 2004లో సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో అదే స్థానం నుంచి రెండో సారి ఎన్నికయ్యారు. 2014 జూన్ 2 నుంచి తెలంగాణ రాష్ట్ర తొలి ఆబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రిగా ఉన్నారు. 2018లో సికింద్రాబాద్ నుంచి మూడోసారి 50వేలకు పైగా భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 నుంచి తెలంగాణ శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారు. 2023 ఎన్నికల్లో మరోసారి సికింద్రాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో కేసీఆర్ ప్రభుత్వంలో సుమారు 800 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. తుకారాంగేట్ ఆర్‌యూబీ, సీతాఫల్ మండీ డిగ్రీ, జూనియర్ కాలేజీ, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, ఉచిత శిక్షణ ఉపాధి అందించే సెట్విన్ కేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

### ఉద్యమమే ఊపిరిగా..!

తీగుళ్ల పద్మారావు తెలంగాణ ఉద్యమ కారుడు. తెలంగాణ ఉద్యమం సమయంలో కీలకంగా వ్యవహరించారు. ప్రజలను వేలాదిగా సమీకరించి..ఉద్యమంలో పాల్గొన్నారు. రాస్తారోకో, రైల్‌రోకోలో కేటీఆర్‌తో కలిసి ఉద్యమించారు. ఆయనపై తెలంగాణ ఉద్యమంలో అనేక కేసులు నమోదయ్యాయి. కేసీఆర్ ఇచ్చిన ప్రతి పిలుపును విజయవంతం చేశారు. కేసీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితులు. పద్మారావును ప్రజలు పజ్జన్న అని ఎంతో ఆప్యాయంగా పిలుచుకుంటారు. పదేండ్ల తెలంగాణలో అనేక అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేపట్టి ప్రజల మన్ననలు పొందారు.



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు, నేతలు

# ఆశీర్వదించండి

### కుటుంబసభ్యుడిగా..సేవకుడిగా ఉంటా.. : మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్, మార్చి 23 : ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని..మీ కుటుంబ సభ్యుడిగా.. సేవకుడిగా ఉంటానని.. మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి లాగానే ముచ్చట్లు చెప్పి, ఓట్లు వేయించుకోవాలని మరికొంత మంది వస్తున్నారని వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఉప్పల్ నాచారంలో బీఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీ మెజార్టీతో రాగిడిని గెలిపించి తీరుతామని నేతలు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ 'తెలంగాణ కోసం కొట్లాడింది కేసీఆర్.. తెలంగాణ రాష్ట్రం సాధించింది కేసీఆర్.. ప్రాణాలు లెక్కచేయకుండా రాష్ట్రం సాధించిన నాయకుడిని మనం జీవితాంతం గుర్తుంచుకోవాలి' అని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. ఐటీ మంత్రిగా పనిచేసిన కేటీఆర్ చేసిన కృషిని యువత మరువలేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతీసాయిజెన్ శేఖర్, పన్నాల దేవేందర్‌రెడ్డి, బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్, జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భారీ మెజార్టీతో గెలిపించుకుందాం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఉప్పల్ నుంచి అధిక మెజార్టీని అందించి, భారీ అధిక్యంతో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకోవాలి. బూత్‌స్థాయి నుంచి డివిజన్ వరకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలి. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలి.

### కలిసికట్టుగా పనిచేద్దాం: మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

మల్కాజిగిరిలో గులాబీ జెండాను ఎగురవేద్దాం. కలిసికట్టుగా పనిచేసి, పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుద్దాం. ప్రతిపక్షాలు చెప్పే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దు. ప్రజల్లోకి వెళ్లి బీఆర్ఎస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలి.



## యూజర్ చార్జీలు.. మరింత భారం

సిటీబ్యూరో: మెట్రో స్టేషన్లలో టాయిలెట్ల వినియోగానికి చార్జీలు వసూలు చేస్తుండటంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. గాలిబే విశాల్ అనే నెటిజన్ మెట్రో స్టేషన్లలో టాయిలెట్‌ను ఉపయోగించుకునేందుకు డబ్బులు వసూలు చేయడం ఆపివేయాలని, ఉచితంగా వినియోగించుకునేలా ఆదేశించాలంటూ.. సీఎం రేవంత్‌రెడ్డికి ఎక్స్(ట్విట్టర్) ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే మెట్రో రైళ్లలో టికెట్ల రేట్లు అధికంగా ఉన్నప్పటికీ నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులపై మరింత భారం పడేలా ఈ నిర్ణయం ఉన్నదని తన పోస్టులో పేర్కొన్నారు. ప్రభుత్వం పరిశీలించి.. మెట్రో ప్రయాణికులందరికీ మేలు చేసే నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు.



## 'టోల్' వద్ద మరమ్మతులు

### వాహనదారులకు ఇబ్బందులు

సిటీబ్యూరో, మార్చి 23 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డుపై కొన్ని చోట్ల టోల్‌ప్లాజాల్లో మరమ్మతులు కొనసాగుతున్నాయి. దీంతో ఓఆర్ఆర్ పైకి ఎక్కే సమయంలో, కిందకు దిగే సమయంలో వాహనాలను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన సెన్సర్లు సరిగా పనిచేయడం లేదు. ఓఆర్ఆర్‌పై 21 చోట్ల ఇంటర్‌చేంజ్‌లు ఉండగా, ఓఆర్ఆర్ పైకి ఎక్కేందుకు, కిందకు దిగేందుకు వేర్వేరుగా టోల్ ప్లాజాలను ఏర్పాటు చేసి చార్జీలను ఫాస్టాగ్ ద్వారా వసూలు చేస్తున్నారు. ప్రధానంగా తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి శంషాబాద్ మీదుగా పెద్ద గోల్కొండ ఇంటర్‌చేంజ్ వరకు ఉన్న ఔటర్‌పై టోల్ ప్లాజాల వద్ద మరమ్మతులు జరుగుతున్నాయి. అయితే సెన్సర్లు సరిగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ఫాస్టాగ్ ద్వారా ఆటోమేటిక్‌గా టోల్ చార్జీలు కట్ అవుతుండటంతో దీన్ని తాముగా సరిగా గుర్తించలేకపోతున్నామని, సందేశాలు ఫోన్లకు సరిగా రావడం లేదని పేర్కొంటున్నారు.



మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సుభాషిణి, గిరిధర్‌లు తమ శిష్య బృందాలతో భరత నాట్య ప్రదర్శనలిచ్చారు.
- కొండాపూర్, మార్చి 23

# బెంగళూరులా.. ఇబ్బంది లేకున్నా..

### నగరంలో పొదుపుతోనే నీటి కటకట అదుపు
### ఇప్పటికైతే మంచినీటి సరఫరాకు ఢోకా లేదు
### భూగర్భ జలాలు పడిపోవడంతో గణనీయంగా పెరుగుతున్న డిమాండు
### వెస్ట్ జోన్‌లో మునుపటికంటే పెరిగిన ట్యాంకర్ల వినియోగం
### జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి స్పష్టీకరణ

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరంలో బెంగళూరు తరహా నీటి కొరత తలెత్తకున్నా... ప్రజలు పొదుపు పాటిస్తేనే నీటి కటకటను అదుపు చేయవచ్చని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. భూగర్భ జలాలు గణనీయంగా పడిపోవడంతో నగరంలో నీటి డిమాండు గణనీయంగా పెరిగి, జలమండలి సరఫరాపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఔటర్ రింగు రోడ్డు వరకు హైదరాబాద్ మహా నగరంలో మంచినీటి సరఫరా పరిస్థితి ఎలా ఉంది? రానున్న నాలుగు నెలల వరకు సమస్య తలెత్తకుండా ఎలాంటి కార్యాచరణ రూపొందించారనే వివరాలను శనివారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ, ఈడీ సత్యనారాయణ, డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్‌కుమార్ (రెవెన్యూ), రవికుమార్ (టెక్నికల్), స్వామి (ఆపరేషన్స్-2)తో కలిసి మీడియాకు వివరించారు. బెంగళూరు నగర నీటి సరఫరా కేవలం కావేరీ జలాలపైనే ఆధారపడి ఉందని, కానీ హైదరాబాద్‌కు మాత్రం కృష్ణా, గోదావరి, సింగూరుతో పాటు జంట జలాశయాల నుంచి నీటి సరఫరా ఉన్నందున సమస్య తలెత్తే అవకాశం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన వనరులైన కృష్ణా, గోదావరి నుంచి సరఫరా తగ్గకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నీటిమట్టాలు తగ్గినా అత్యవసర మోటార్ల ద్వారా నగర సరఫరాపై ప్రభావం పడకుండా ఇప్పటికే ఏర్పాట్లు కూడా సిద్ధం చేసుకున్నామని చెప్పారు. ఎండలు పెరుగుతుండటం, అందునా భూగర్భ జలాలు గతం కంటే తీవ్రస్థాయిలో పడిపోయి, బోర్లు ఎండిపోవడంతో సహజంగా నీటి డిమాండు బాగా పెరుగుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమయంలోనే ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, నిత్యావసరాలకు కాకుండా నీటిని ఇతర అవసరాలకు వినియోగించవద్దని కోరారు. నీటిని వృథా చేస్తే చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు.




మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

### దుర్వినియోగం చేస్తే.. కఠిన చర్యలే

మంచినీటిని దుర్వినియోగం చేస్తే.. కఠిన చర్యలు తీసుకునేందుకు జలమండలి అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు వాటర్ బోర్డు యాక్టులో ఉన్న నిబంధనలు మరింత పకడ్బందీగా అమలు చేయనున్నారు. ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలంటూ నమోదైన పిల్‌పై హైకోర్టు స్పందిస్తూ వాటర్‌బోర్డుకు ఆదేశాలు జారీ చేసింది. వాటర్‌బోర్డు సరఫరా చేసే నీటి వినియోగానికి నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. గృహ అవసరాలకు సరఫరా చేసే నీటిని వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తే చర్యలు ఉంటాయని పేర్కొంది. ఇందులో వాటర్‌బోర్డు నీటిని గార్డెన్ అవసరాలు లేదా ఇంటి నిర్మాణ కార్యకలాపాల్లో వాడకూడదని పేర్కొంది. అదేవిధంగా స్విమ్మింగ్ పూల్స్, వాటర్ ఫౌంటెయిన్స్‌తో పాటు, మాస్ బాతింగ్(ఓపెన్ మాస్ బాత్), మెకానికల్ వంటి పనులకు వాడొద్దని స్పష్టం చేసింది. అదేవిధంగా హోటల్స్, కమర్షియల్ బోర్డింగ్, రెసిడెన్షియల్ క్లబ్స్ సినిమా థియేటర్లలలో వాడటానికి వీలు లేదని పేర్కొంది.

### రూ.4 కోట్లతో మోటర్ల ఏర్పాటు..


ఐదు నీటి వనరుల ద్వారా నగరంలో రోజుకు 559.81 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తుండగా.. కృష్ణా నది నుంచి రోజుకు 270 మిలియన్ గ్యాలన్లు ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో 513.6 అడుగుల నీటిమట్టం ఉండగా... 510 అడుగుల వరకు ఏఎమ్మార్ ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసుకోవచ్చన్నారు. అంతకంటే నీటిమట్టం పడిపోతే పుట్టంగండి వద్ద అత్యవసర మోటర్ల ద్వారా ఎత్తిపోస్తామన్నారు. ఇందుకు రూ.4 కోట్లతో టెండర్ల ప్రక్రియ నిర్వహించి, ఏజెన్సీని ఎంపిక చేశామని, 510 అడుగులు తగ్గగానే 48 గంటల్లోనే అత్యవసర మోటార్లు అమరుస్తామన్నారు. 500 అడుగుల వరకు సాగర్‌లో 20 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని, ఇందులో నగర నీటి అవసరాలకు రానున్న నాలుగు నెలల వరకు ఆరు టీఎంసీలు అవసరమవుతాయన్నారు. ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాల తరలింపులోనూ సమస్య తలెత్తకుండా నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకుంటున్నామని, అక్కడ డెడ్‌స్టోరేజీ పోను అక్కడ 5.5 టీఎంసీల నీటి లభ్యతలో రానున్న నాలుగు నెలలకు 3.6 టీఎంసీలు అవసరమవుతాయన్నారు.

### సరఫరాను మరింత పెంచుతాం...

నీటి వనరుల నుంచి సరఫరా చేస్తున్న పరిమాణాన్ని క్రమంగా పెంచుతున్నామని ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. గతంలో ఎల్లంపల్లి నుంచి తరలించే 25 ఎంజీడీల గోదావరి జలాలను సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలకు సరఫరా చేశారని, మల్లన్నసాగర్ నుంచి ప్రత్యామ్నాయ సరఫరా ఉండటంతో ఆ నీటిని కూడా నగరానికి తరలిస్తున్నామన్నారు. మిషన్ భగీరథ కింద ఇతర ప్రాంతాలకు ఇచ్చే నీటిని ప్రత్యామ్నాయాలు ఉన్నందున నగరానికి మళ్లిస్తామని, నగరంలో రోజుకు 559 మిలియన్ గ్యాలన్ల నుంచి మే నాటికి 575 మిలియన్ గ్యాలన్ల వరకు సరఫరాను పెంచుతామన్నారు.

### వెస్ట్‌జోన్‌లో భారీగా పెరిగిన డిమాండు..

నగరంలో భూగర్భజలాలు పడిపోవడంతో జలమండలి ట్యాంకర్లకు డిమాండు కూడా పెరుగుతున్నదని జలమండలి ఎండీ చెప్పారు. ఈ క్రమంలో జనవరిలో రోజుకు 2వేల ట్రిప్పుల సరఫరా ఉంటే, ఇప్పుడు అది 5800 వరకు పెరిగిందన్నారు. ప్రధానంగా వెస్ట్‌జోన్ పరిధిలోనే ట్యాంకర్లకు భారీ ఎత్తున డిమాండు వస్తున్నదన్నారు. ట్యాంకర్ బుక్ చేసిన తర్వాత కొన్నిచోట్ల 3-4 రోజుల వ్యవధిలోనే నీటిని అందిస్తున్నామని చెప్పారు. గతంలో ట్యాంకర్ల సంఖ్య 550 ఉంటే ఇప్పుడు వాటిని 590కి పెంచామని ఎండీ వివరించారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవడంపైనా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, చాలాచోట్ల కరెంటు మోటార్ల ద్వారా నల్లా నీటిని లాగుతున్నందున లోప్రెషర్ సమస్య తలెత్తుతున్నదన్నారు.



# వేసవి గండం గడిచేదెట్లా?

### అష్టకష్టాలు పడుతున్న విద్యుత్ శాఖ
### గ్రేటర్ పరిధిలో నిరంతర సరఫరాపై ప్రత్యేక దృష్టి
### ప్రతి సెక్షన్‌లో సరఫరా తీరుతెన్నుల పర్యవేక్షణ
### ప్రతి రోజూ సీఎండీ సమీక్ష..పలు సూచనలు

సిటీబ్యూరో, మార్చి 23 (నమస్తే తెలంగాణ): వేసవి గండాన్ని ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ అష్టకష్టాలు పడుతున్నది. ఒకవైపు గణనీయంగా పెరుగుతున్న కరెంటు డిమాండు, మరోవైపు క్షేత్రస్థాయిలో రకరకాల సమస్యలు విద్యుత్ శాఖకు అగ్ని పరీక్షగా మారాయి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 55 లక్షలకు పైగా గృహ, వ్యాపార, పరిశ్రమలకు చెందిన విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) పరిధిలోని జీహెచ్ఎంసీ పరిధి అత్యంత కీలకమైందిగా ఉంది. సింహభాగం విద్యుత్ వినియోగం అంతా ఇక్కడే ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు వేసవి కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. కోతలకు అవకాశం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించడంపైనే ప్రధానంగా దృష్టి సారించారు. అధికార యంత్రాన్ని నిరంతరం అప్రమత్తంగా ఉంచేందుకు డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రతి రోజూ ఉదయం 8.30 గంటల నుంచే విద్యుత్ సరఫరా తీరుపై సమీక్షిస్తున్నారు.

### మార్చిలోనే 75 మిలియన్ యూనిట్లు..

గతేడాది మేలో ఉన్న డిమాండు ఈ ఏడాది మార్చిలోనే ఉంది. గతేడాది మే నెలలో 79 మిలియన్ యూనిట్లు వినియోగం అయితే, ఈ ఏడాది మార్చి నెలలో 75 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. ఈ నేపథ్యంలోనే కొత్తగా చేపట్టిన పనులకు ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్)లు ఇవ్వకుండా విద్యుత్ సరఫరా నిరంతరం ఇచ్చేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. దీనికి తోడు విద్యార్థులు పరీక్షలు జరుగుతుండటంతో విద్యుత్ అంతరాయం అనే మాటకు చోటు లేకుండా ఉండాలని సీఎండీ ఆయా జోన్ల సీజీఎంలు, సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లతో నేరుగా పర్యవేక్షిస్తున్నారు. ఇంకా రెండు నెలల కాలం విద్యుత్ శాఖకు అగ్నిపరీక్ష వంటిదని, దానికి తట్టుకునేలా క్షేత్ర స్థాయిలో అధికార యంత్రాంగం అంతా సరఫరాపై ప్రధానంగా దృష్టిసారించాలని సూచించారు.

### సబ్ ఇంజినీర్లతోనూ వీడియో కాన్ఫరెన్స్‌లు

వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ఉండేందుకు సెక్షన్ స్థాయిలో ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఆయా సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్లు సెక్షన్ స్థాయిలో పనిచేసే సబ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్నారు. విద్యుత్ డిమాండుకు ఎక్కువగా ఉండటంతో పాటు అంతరాయాలు ఏర్పడేందుకు అవకాశం ఉండటంతో అధికారులు, ఇతర ఉద్యోగులు విద్యుత్ సరఫరా పర్యవేక్షించేందుకు సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పరిశీలన చేస్తూ ఉండాలంటున్నారు.

### ఫీడర్ల వారీగా సమీక్ష..

గ్రేటర్ పరిధిలో ఉండే 9 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ సరఫరా తీరును ఫీడర్ల వారీగా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. 33కేవీ ఫీడర్లు 1400 ఉండగా, 11కేవీ ఫీడర్లు 4వేల వరకు ఉన్నాయి. ఆయా ఫీడర్ల పరిధిలో ప్రతి రోజూ సరఫరాలో ఎదురైన ఇబ్బందుల పైనా ప్రతి రోజు సీజీఎం ఆపరేషన్స్, ఆయా సర్కిళ్ల ఎస్ఈలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నారు. సర్కిల్ ఎస్ఈతో పాటు ఆపరేషన్స్ డీఈ, ఏడీఈ, ఏఈలు ఎక్కువ సమయంలో క్షేత్ర స్థాయిలో ఉండి కరెంటు సరఫరా తీరును పరిశీలించాలని సీఎండీ సూచించడంతో సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోటకు ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షిస్తున్నారు.